శ్మశాన వాటిక అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ధర్మారం,ఆగస్టు12: నంది మేడారం శివారులోని శ్మశాన వాటిక స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ రజితకు గ్రామంలోని ఎస్సీలు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 529లోని ప్రభుత్వ భూమి రెండెకరాలు శ్మశాన వాటిక కోసం కేటాయించారు. ఆ స్థలంలో ఎస్సీలు దహన సంస్కారాలు చేస్తున్నారని వారు వివరించారు. 627 సర్వే నంబర్ పట్టా భూమి దర్శనాల రాయలింగుది ఆనుకొని ఉండగా శ్మశాన వాటిక భూమిని చదును చేసి అక్రమిస్తున్నాడని తహసీల్దార్‌కు సమర్పించిన వినతి పత్రంలో ఆరోపించారు. దీనిపై విచారణ చేసి శ్మశాన వాటిక స్థలానికి సరిహద్దులు ఏర్పాటు చేయించాలని వారు తహసీల్దార్‌ను కోరారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ నిరసన

జ్యోతినగర్(రామగుండం), ఆగస్టు 12: రైల్వే ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ రామగుండం బ్రాంచీ ఆధ్వర్యంలో సోమవారం రామగుండం రైల్వేస్టేషన్ ఏరియా ఆర్ఓహెచ్ షెడ్ వద్ద నిరసన జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రామగుండం బ్రాంచీ సెక్రటరీ ఎం రామారావు మాట్లాడుతూ రైల్వే సంస్థలో నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయ్యాలని, 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డీఏను విడుదల చేయ్యాలన్నారు. రైల్వేలో ఖాళీల భర్తీ, 8వ వేతన సవరణ, ఎడ్యూకేషన్ అలవెన్స్‌ను పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు పొడగింపు, లోకో పైలెట్‌లకు వీక్లీ రెస్ట్, ఇతర డిమాండ్‌లను అమలు పరుచాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఓవై స్వామి, వీరన్న, ఆనంద్, రవీందర్‌రెడ్డి, గణేష్‌సింగ్, మోజెస్, తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో ఐపీఎస్ విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్ రూరల్, ఆగస్టు 12: సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ నెల 11న హైదరాబాద్ లో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జి. రిషివర్ధన్, జి. హర్షవర్ధన్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ సోమవారం విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

మధ్యాహ్నం పరిశీలన

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 12: సంజయ్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని సోమవారం కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వీ ప్రకాశ్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కార్పొరేటర్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని పాఠశాల హెచ్ఎంకు సూచించారు.

నివాళి

పెద్దపల్లి కమాన్, ఆగస్టు 12 : ఇటీవల మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు పెద్దపల్లి సమగ్ర శిక్ష సంఘం ఆధర్యంలో నివాళులర్పించారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సంతాప కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సంఘం ఉద్యోగులు పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించా, మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తిప్పని తిరుపతి, రవిరాజ్, తాళ్లపల్లి మల్లయ్య, కుంబాల సుధాకర్, రహిముద్దీన్, శ్రీలత, సంధ్యారాణి, రమేష్, సుందరగిరి శ్రీనివాస్ తదితరులున్నారు.

సారూ.. మాగోడు తీర్చండి..!

ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరిన అర్జీదారులు

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): ఎక్కడికి వెళ్లినా సమస్యలు తీరడం లేదని, సారూ.. మా గోడు తీర్చం డంటూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్ లాల్, అరుణశ్రీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. విజ్ఞాపన పత్రాలతో వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించి గోడు తీర్చాలని విజ్ఞప్తి చేయగా కలెక్టర్ ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తన భర్త 2022 ఫిబ్రవరి 10న 2022న చనిపోయాడని తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ పెద్దపల్లి పట్టణానికి చెందిన వీ తిరుపతమ్మ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరుతూ గోదావరిఖనిలోని విఠల్ నగర్‌కు చెందిన ఎండీ రిహాజుద్దీన్ దరఖాస్తు చేసుకోగా లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు లేఖ రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పనులు చేస్తుండగా 19 ఏప్రిల్ 2024న పాము కాటు వేసిందని, వైద్యం కోసం చేసిన ఖర్చులను ఉపాధి హామీ కింద మంజూరు చేయించాలని కోరుతూ పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామానికి చెందిన ఎం. లక్ష్మీ దరఖాస్తు చేసుకోగా డీఆర్డీవోకు సిఫారసు చేశారు. మంథని మండలం రచ్చపల్లి గ్రామానికి చెందిన నగావత్ రుక్కమ్మ తమ ఇల్లు, పొలం ఓపెన్ కాస్ట్ మైనింగ్ విస్తరణలో సింగరేణి ప్రాజెక్టు కింద స్వాధీనం చేసుకున్నారని, ప్రకటించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో తన పేరు, తన కుమారుని పేరు రాలేదని, వచ్చేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మంథని ఆర్డీవోకు రాస్తూ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులు, సహాయ అధికారులు పాల్గొన్నారు.

కోడళ్లు అన్నం పెట్టడం లేదు..

మాకు సంబంధించిన వ్యవసాయ భూమిని ఒకరు, డబ్బులు మరొకరు తీసుకున్నరు. ఇప్పుడు మాకు అన్నం పెడుతలేరు. మమ్మల్ని పట్టించుకోని కోడళ్లపై చర్యలు తీసుకోవాలి. మా భూమిని మాకు ఇప్పించి మా తదనంతరం వారికి చెందే విధంగా చర్యలు తీసుకోవాలి

బత్తుల వెంకటయ్య, లక్ష్మి ముత్తారం

మేమేం పాపం చేశాం..



సర్కారు రుణ మాఫీ అన్నరు. మా లోన్ అట్లనే ఉన్నది. లోన్ మాఫీ అంటే బ్యాంకు మేనేజర్ ఏం పనిలేదా ఎల్లిపోర్రి అంటున్నడు. రూ. 1.20 లక్షల లోను మాఫీ అయిత లేదు. ఇంకో నెలకైతది.. రెండు నెలల కైతది అంటున్నరు. కరెంటు బిల్లు మాఫీ లేదు. గ్యాసు సబ్సిడీ చేస్తలేరు. మేమేం పాపం చేసినం. మాకెందుకి ఇయ్యరు ఇవ్వన్నీ. గిట్లైతే మేం బతుకుడెట్ల.

-ఇత్తనవేన సత్తయ్య-రాజేశ్వరి, ఆకెనపల్లి అంతర్గాం మండలం

గురుకులాల భద్రత మన అందరి బాధ్యత

మంథని, ఆగస్టు 11: గురుకులాల భద్రత అందరి బాధ్యత అని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకుడు, సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేశ్ అన్నారు. మంథనిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలను పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దార మధుతో కలిసి సోమవారం సందర్శించారు. పాఠశాలలోని మూత్రశాలలు, స్నానపు గదులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు స్నానానికి వేడి నీళ్లు కావాలని అడిగారని, వారి సమస్య పరిష్కారానికి ఎస్టీపీసీ హెచ్ ఆర్ అధికారులతో మాట్లాడుతామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్ వైజర్, సమతా సైనిక దళ్ నాయకులు చందనగిరి కుమార్, ఆత్రం హరీశ్ పాల్గొన్నారు..

బాధిత కుటుంబానికి పరామర్శ

మంథని, ఆగస్టు 12: పట్టణంలోని బోయినిపేటలో పోతరవేన శంకరమ్మ ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సోమవారం పరామర్శించారు. దశ దిన కర్మలో పాల్గొన్న పుట్ట మధూకర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్‌తో పాటు తదితరులున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జూలపల్లి, ఆగస్టు 12 : పెద్దాపూర్‌లోని 'ఆదర్శ' పాఠశాల బాలికల వసతి గృహంలో తాత్కాలిక అసిస్టెంట్ కుక్ పోస్ట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కవిత సూచించారు. మహిళలు పదో తరగతి ఉత్తీర్ణులై, అనుభవం కలిగిన 25 నుంచి 55 ఏండ్లలోపు అభ్యర్థులు 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఏఐటీయూసీలోకి బ్లాస్టింగ్ కార్మికులు

గోదావరిఖని, ఆగస్టు 12: సింగరేణి ఓసీపీ 5లో పనిచేస్తున్న బ్లాస్టింగ్ సెక్షన్ కాంట్రాక్ట్ కార్మికులు ఏఐటీయూసీ యూనియన్‌లో చేరారు. ఈ మేరకు ఆదివారం రాత్రి భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్లు చట్ట ప్రకారం వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థిక నష్టంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. కార్మికులకు సమాన పనికి సమానం వేతనం, ఈపీఎస్, ఈఎస్ఐ అమలు చేయ్యాలన్నారు. ఏఐటీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, నాయకులు మద్దెల దినేశ్, లెనిన్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సామగ్రి అందజేత

జూలపల్లి, ఆగస్టు 12 : జూలపల్లిలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి మాజీ ఉప సర్పంచ్ కొప్పుల మహేష్ మైక్ సెట్ అందజేయడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 8 వేల విలువైన టెంపుల్ బెల్ టైమర్ అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ పొట్టాల మల్లేశం, నాయకులు గుడిపాటి సంతోశ్‌రెడ్డి, లెక్కల వజ్రారెడ్డి, తాటిపెల్లి రాయలింగం, దేవసాని శంకరయ్య, బెజ్జంకి రమేశ్, మెండె మల్లేశం, వంగపెల్లి వెంకటరమణ, బండి స్వామి, దీకొండ వెంకటేశ్, కోడూరి రాజేశ్వర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217
సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం|| చేతివ్రాత ద్వారా నెలకు 10 వే||ల నుండి 15 వే||ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311344
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ధర్మారం : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రామగిరి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 12: ఉజ్వల భవిష్యత్ కలిగిన విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్ సూచించారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఏసీపీ మాట్లాడా రు. విద్యార్థులు వ్యసనాలకు బానిస కావద్దన్నారు. మత్తు పదార్థాలు అమ్మినట్లు తెలిసినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు .సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా కలిసి ఉండాలనారు. ర్యాగింగ్‌తో చదువును అశ్రద్ధ చేయొద్దన్నారు. ఇక్కడ వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ భూమేశ్, ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రామగుండం బల్దియా ఉద్యోగుల ప్రతిజ్ఞ

కోల్‌సిటీ, ఆగస్టు 12: మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో తమవంతు పాత్ర పోషిస్తామని రామగుండం నగర పాలక సంస్థ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రారంభించి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విధులకు హాజర య్యే ముందు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఆర్ఐ శంకర్ రావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మంథని,ఆగస్టు 12: నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంథని బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ సిటీ : మాట్లాడుతున్న ఖని ఏసీపీ రమేశ్

జేఎన్టీయూలో..

రామగిరి, ఆగస్టు 12: స్థానిక జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా మారుస్తామని విద్యార్థులు సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 12: రాఘవాపూర్ శివారులోని మంథని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

ఎలిగేడు, ఆగస్టు 12: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర రావు, ప్రధానోపాధ్యాయుడు గంద్ర దేవేందర్ రావు,కార్యదర్శి అంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మారం,ఆగస్టు12: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మండల కేంద్రంలో లయన్స్ క్లబ్, పోలీస్ శాఖ అధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టగా లయన్స్ ఇంటర్నేషనల్ 320జీ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ లయన్ కెప్టెన్ మధుసూదన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏఎంసీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని పెద్దపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే ప్రవీణ్ కుమార్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ,ఎస్ఐ లక్ష్మణ్‌ను క్లబ్ బాధ్యులు సన్మానించారు. బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ, క్లబ్ ఆర్‌సీ రాజేందర్, డిస్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్ సామ ఎల్లారెడ్డి, కార్యదర్శి ఎండీ ముజాహిద్, కోశాధికారి కట్ట రమేశ్, వైస్ ప్రెసిడెంట్ ఇప్ప మల్లేశం, రీజినల్ సెక్రటరీ పీ మునీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఓదెల, ఆగస్టు 12: పొత్కపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నషా ముక్త్ భారత్ అభియాన్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొత్కపల్లి పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కమాన్, ఆగస్టు 12 : పెద్దపల్లి గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం డ్రగ్స్ నివారణ, ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జే రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

రామగిరి, ఆగస్టు 12ః సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి ఎప్పుడూ వెనుకాడేది లేదని ఆర్జీ–3 జీఎం సుధాకర్ రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో నూతన టేబుల్స్, కుర్చీలతో ఆధునీకరించిన క్యాంటీన్‌ను వారు ముఖ్యతిథిగా హాజరై ప్రారంభించారు. ఏ ఇతర ప్రభుత్వ రంగ సంస్థ చేయని విధంగా సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. జీఎం కార్యాలయ ఉద్యోగుల కోసం క్యాంటీన్‌ను ఆధునీకరించామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్, ఎస్‌వోటు జీఎం రఘుపతి, అధికారులు చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్, రాజేంద్రప్రసాద్, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడెపు శంకర్‌కు నల్ల వజ్రం అవార్డు

కోల్‌సిటీ, ఆగస్టు 12: గోదావరిఖనికి చెందిన పద్మశాలీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్‌కు నల్లవజ్రం కీర్తి అవార్డు లభించింది. తార ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళోత్సవాలలో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి నల్లవజ్రం పురస్కారాలతో సత్కరించారు. కాగా, ఆడెపు శంకర్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఆయన్ను నల్లవజ్రం కీర్తి అవార్డుతో ఘనంగా సత్కరించారు. కాగా, తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసిన తార ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు సంకె రాజేశ్‌కు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, శంకర్ ఈ అవార్డు అందుకోవడం పట్ల పద్మశాలీ సేవా సంఘం నాయకులు, సోమవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు.

నగదు పంపిణీతోనే ప్రయోజనం

మంథని, ఆగస్టు 12: మత్స్యకారులకు ఏటా జూన్‌లో ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటిదాకా అందుబాటులోకి రాలేదని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు చేప పిల్లలు ఇవ్వడానికి బదులుగా నగదు పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మత్స్యకారులకు నగదు పంపిణీ చేయాలనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల గురించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. నగదు పంపిణీ ద్వారా నాణ్యమైన చేప పిల్లలను సరైన సమయంలో కొనుగోలు చేసుకుంటారని, మత్స్యకారుల ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

'సాండ్ టాక్సీ' ప్రారంభం

సాండ్ టాక్సీ ప్రారంభిస్తున్న మైనింగ్ ఏడీ శ్రీనివాస్

ముత్తారం, ఆగస్టు 12: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సాండ్ టాక్సీ సేవలను వినియోగించుకోవాలని పెద్దపల్లి మైనింగ్ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆన్‌లైన్ సాండ్ టాక్సీ విధానాన్ని సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇసుక అవసరం ఉన్న వినియోగదారులు ఆన్‌లైన్ లో మన ఇసుక పోర్టల్ ద్వారా బుక్ చేసుకుంటే ఒక్క రోజులో సరఫరా చేసామని తెలిపారు. ముత్తారం, రామగిరి, మంథని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇసుక అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్‌కు రూ.25వేలు, లారీకి రూ. లక్ష దాకా జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనింగ్ సిబ్బంది రాజు, మాజీ ఎంపీటీసీ అల్లం తిరుపతి, ట్రాక్టర్ యజమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

గర్భిణులకు సీమంతం చేస్తున్న రామారావు

ధర్మారం,ఆగస్టు12: మండల కేంద్రంలో శ్రీ అమ్మ భగవాన్ పద్మమ్మ జన్మదినాన్ని పురస్కరించుకొని మానవ సేవా సమితి కన్వీనర్ పూస్కూరు రామారావు ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సోమవారం 32 మంది గర్భిణులకు సీమంతం చేసి సత్కరించారు.అనంతరం అన్నదానం చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

మంథని రూరల్,ఆగస్టు 12: మండలంలోని ఆరెంద గ్రామంలో సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించగా స్పందన లభించింది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన వృద్ధులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ శ్రీవాణి, డీపీఎం విద్యాసాగర్, డాక్టర్ జ్యోత్స్న, సిబ్బంది మేఘమాల, శ్రీనివాస్,కృష్ణమూర్తి,ఆశ క్యాకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కమాన్‌పూర్, ఆగస్టు 12: మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో సురేష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో పరిశుభ్రత లేక దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, ఫాగింగ్ చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు చికున్ గున్యా జ్వరాలతో అల్లాడుతున్నారని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని కోరారు. బీఆర్ఎస్‌వై మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, కమాన్ పూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, బీఆర్ఎస్ నాయకులు ఎలబోయిన రామ్మూర్తి, ఐట్ల పవన్ కల్యాణ్, తోట రాజ్ కుమార్, సాన సురేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటిచెప్పాలి

ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 12: భరతమాత బిడ్డలుగా దేశభక్తిని చాటాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిదని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రామగుండం నియోజకవర్గంలోని మహనీయుల విగ్రహాలను శుద్ధి చేశారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేసి పాలాభిషేకం చేశారు. ఇక్కడ నాయకులు మెరుగు హన్మంత్‌గౌడ్, గాండ్ల ధర్మపురి, కాసిపేట శివాజీ, కొడూరు రమేశ్, గుండబోయిన భూమయ్య, మిట్టపల్లి సతీశ్, గొపగాని నవీన్‌గౌడ్, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనారాయణ, బూడిద రమేశ్, అందె రాజ్‌కుమార్, పంగ రవి, నర్సయ్య, విశ్వాస్, కుమారస్వామి, వాసు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

హిందువులపై దాడి జరిగితే స్పందించరా?

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లోని హిందువులపై దాడి జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ సహ ఇండియా కూటమి ఎందుకు స్పందిచడం లేదో ప్రజలకు జవాబు చెప్పాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నాగులమాల్యల సత్యం ప్రశ్నించారు. సోమవారం కామారెడ్డి జిల్లాలో 10,11 తేదీల్లో జరిగిన తెలంగాణ వర్షారంభ సమావేశాల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ స్వరూప్ కిరణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నాగులమాల్యల సత్యం నియమితులయ్యారు. ఈ సందరర్భంగా వారు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, మరణహోమాన్ని ఖండించారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు శిక్షణ తరగతులు

కోల్‌సిటీ, ఆగస్టు 12: అడ్డగుంటపల్లిలోని ఆర్యవైశ్య భవన్‌లో పారిశ్రామిక ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల హెల్పర్లకు కొమ్ము రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం ఆత్మజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మ విద్వరిష్టా, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తటపర్తి రాజ్యలక్ష్మి మాట్లాడారు. ఆత్మ పరిణామ క్రమం జరిగిన అంశంపై వివరించారు. అహంకారం, కోపం, ఈర్ష్య, ఒత్తిడి లాంటి చెడు గుణాలు తగ్గుతాయని చెప్పారు. నేటి సాంకేతిక ప్రపంచంలో ఒత్తిడితో కూడిన జీవన శైలి ప్రజలను ధ్యానం వైపు మళ్లిస్తుందన్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ సత్యనారాయణ, బాబు రావు, జగదీష్, నీలిమ, శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

నాగారం వాసికి జాతీయ అవార్డు

మంథని రూరల్, ఆగస్టు 12: నాగారం గ్రామానికి చెందిన కావటి శ్రీశైలం యాదవ్ జాతీయ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా భారతీయ విద్యాపీఠం ఆల్ ఇండియా యూత్ టీమ్ జీనిత్ ఇంటర్నేషనల్ సంస్థ చైర్మన్ మనీష్ గోవాయి, కల్చరల్ మేనేజర్ మిథాలీ కాంబ్లీ సోమవారం ఢిల్లీలో శ్రీశైలం యాదవ్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా నాగారం యాదవ సంఘం, ఒగ్గు కళాకారులు, నాయకులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

ఏఎల్పీలో కార్మికుడికి గాయాలు

రామగిరి ఆగస్టు 12 : ఏపీఏ డివిజన్‌లోని ఏఎల్పీలో సోమవారం గనిలో జరిగిన ప్రమాదంలో సపోర్టింగ్ కోసం డ్రిలింగ్ చేస్తుండగా కుమ్మరి మహేశ్ అనే కార్మికుని చేయి డ్రిల్లింగ్ యంత్రంలో ఇరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని చికిత్స కోసం సెంటినరీకాలనీలోని డిస్పెన్సరీకి తరలించారు. ఈ ప్రమాదం ఉదయం పి షిఫ్ట్‌లో జరిగిందని ప్రమాదం విషయం అధికారులు గోప్యంగా ఉంచడంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.